క్లుప్తంగా

నేడు విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని ఝాన్సీ లక్ష్మీబాయి రోడ్డులో భీమేశ్వర స్వామి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు చురుకుగా ఏర్పాట్లు చేస్తున్నారు. పాత శివాలయాన్ని తొలగించి భీమేశ్వర శివాలయంగా నిర్మాణం చేశారు. సోమవారం నుంచి 3 రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఆంజనేయ స్వామి, గణపతి, నవగ్రహాలు, ధ్వజస్తంభాన్ని పునఃప్రతిష్ఠాపన చేయనున్నారు.

అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు

కోడేరు: మండలంలోని ఆయా గ్రామాల నుంచి ఇతర ప్రాంతాలకు అక్రమంగా ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తే.. అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ రాజు హెచ్చరించారు. ఆదివారం ఆయన మాట్లాడారు. కొంత మంది ట్రాక్టర్ యాజమానులు అనుమతి లేకుండా నాగులపల్లితండా వాగు, ముత్తిరెడ్డిపల్లి, జనుంపల్లి రిజర్వాయర్ వాగుల నుంచి నాగర్‌కర్నూల్, వనపర్తి, కొల్లాపూర్, పెద్దకొత్తపల్లి తదితర పట్టణాలకు అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నట్లు తమకు దృష్టికి వచ్చిందన్నారు. ఎవరైనా ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

క్రీడా సంబురాలను విజయవంతం చేయాలి

కోడేరు: తెలంగాణ క్రీడాకారులను జాతీయ అతర్జాతీయ స్థాయికి చేర్చాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం సీఎం కప్ 2023లో మండల స్థాయిలో ఈ నెల 15, 16, 17 తేదీల్లో నర్సాయిపల్లిలో కబడ్డి, ఖోఖో, వాలీబాల్, ఫుట్‌బాల్ తదితర ఆటల పోటీలు నిర్వహిస్తుందని ఎంపీడీఓ శ్రవణ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాని విజయవంతం చేయాలని కోరారు.

రెండో విడత గొర్రెల పంపిణీ చేపట్టాలి

కొల్లాపూర్: రెండో విడత గొర్రెల యూనిట్ల పంపిణీని వెంటనే చేపట్టాలని గొర్రెల కాపరుల సంఘం నాయకులు చంద్రశేఖర్‌యాదవ్ డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో మాత్రమే గొర్రెల యూనిట్ల పంపిణీ జరుగుతోందన్నారు. రాజకీయాలకు తావులేకుండా అర్హులైన గొర్రెలకాపరులు అందరికీ యూనిట్లు పంపిణీ చేయాలని కోరారు. యూనిట్ల పంపిణీలో దళారుల పాత్ర లేకుండా చూడాలన్నారు. గొర్రెల కాపరులు సంఘటితంగా ముందుకు సాగితేనే తమ హక్కులు సాధించుకోవచ్చన్నారు.

బాటసారులకు అంబలి పంపిణీ

అచ్చంపేట రూరల్: పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో రక్షిత మహిళా సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంబలి కేంద్రం వద్ద ఆదివారం మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్ బాటసారులకు అంబలి అందించారు. నర్సింహగౌడ్ తండ్రి కృష్ణయ్యగౌడ్ రెండో వర్ధంతి సందర్భంగా ప్రత్యేకంగా అంబలి తయారు చేయించి బాటసారులకు పంపిణీ చేశారు. కౌన్సిలర్ రమేష్‌రావు, చేపూరి జయమ్మ పాల్గొన్నారు.

కమిటీ ఎన్నిక

మన్ననూర్: డీసీసీ అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ మన్ననూర్ గ్రామ కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ముడావత్ తుల్సానాయక్, ఉపాధ్యక్షుడు సైదులు, మేరాజ్, ప్రధాన కార్యదర్శిగా దాసరి వెంకటేశ్వర్లు తదితరులను ఎన్నుకున్నారు.

కల్వకుర్తిలో వైద్యశిబిరం

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో సాయి మందిరంలో వైద్యశిబిరం నిర్వహించారు. 191 మందికి ఈ శిబిరంలో పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డాక్టర్లు రాజేష్, వెంకట్‌స్వామి, విజయ్, సౌమ్య, మౌనిక, రాకేశ్ పరీక్షలు నిర్వహించారు. వైద్య శిబిరానికి వచ్చిన రోగులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు.

ఆధ్యాత్మిక సేవలకు పురస్కారం



మన్ననూర్: జిల్లా, రాష్ట్ర వ్యాప్తంగా అనేక ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ పాలుపంచుంటున్న విశ్రాంత ఉద్యోగి సంబు వెంకటరమణ దంపతులను జీసీఎస్ వల్లూరీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సద్గురు దైవజ్ఞ శర్మ, ఏపీలో రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య చేతుల మీదుగా నంది అవార్డు, శాలువా, జ్ఞాపికతో ఘనంగా సన్మానించారు. ఆదివారం మాతృదినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పలు కార్యక్రమాలతో పాటూ సన్మానం కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారిని సన్మానించారు. సేవా కార్యక్రమల్లో చురుకుగా పాల్గొనేలా ఈ సన్మానం మా బాధ్యతలను పెంచిదని సన్మాన గ్రహీతలు అభిప్రాయం వ్యక్తం చేశారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి



ఈగలపెంటలోని వీరాంజనేయ స్వామి ఆలయంలో హోమం నిర్వహిస్తున్న భక్తులు

కల్వకుర్తి రూరల్: హనుమాన్ జయంతి వేడుకలు ఆదివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలోని ఆంజనేయ స్వామికి సింధూర లేపనం పూశారు. హనుమాన్ చాలీసాను పారాయణం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వంగూరు: మండల కేంద్రంలో హనుమాన్ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. గ్రామానికి చెందిన భక్తులు పెద్దఎత్తున హాజరై స్వామివారి దర్శనం చేసుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం స్వామివారి ఊరేగింపు నిర్వహించారు. అనంతరం లడ్డూ వేలం నిర్వహించారు. సర్పంచ్ లావణ్య ఎల్లగౌడ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పెంట్లవెల్లి: మండల కేంద్రం, మంచాలకట్ట, జటప్రోల్, గోపులాపూర్ గ్రామాల్లో ఆదివారం హనుమాన్ జయంతి సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. పలు ఆలయాల్లో ప్రజలు పెద్దఎత్తున ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మండల పరిధిలోని మంచాలకట్టలో నూతనంగా నిర్మాణం అవుతున్న ఆంజనేయస్వామి ఆలయంలో సర్పంచ్ విజయ్‌కుమార్, గ్రామస్తులు ఆకుపూజ నిర్వహించి, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

దోమలపెంట: ఈగలపెంటలోని వీరాంజనేయస్వామి దేవస్థానంలో హనుమాన్ జయంతిని నిర్వహించారు. తెల్లవారుజామున ఆలయంలో స్వామివారికి మంగళవాయిద్యాలు, సుప్రభాత సేవ, ప్రత్యేక పూజలు నిర్వహించారు.



పెంట్లవెల్లిలో..



కల్వకుర్తి దేవాలయంలో..



వంగూరులో హోమం చేస్తున్న భక్తులు

ఘనంగా అంతర్జాతీయ మాతృదినోత్సవం



అచ్చంపేటలో కేక్‌కట్ చేస్తున్న మహిళలు



ఈగలపెంటలోని జెన్‌కో చర్చిలో..

అచ్చంపేట రూరల్: అంతర్జాతీయ మాతృదినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం అచ్చంపేటలోని అంజనీమాత సేవా సమితి ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. వృద్ధాశ్రమంలోని వృద్ధులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. బాలాజీ, సునితాబాయి, శకుంతల, హేమలత, చంద్రకళ పాల్గొన్నారు.

దోమలపెంట: మదర్స్ డే ను ఈగలపెంటలోని జెన్‌కో చర్చిలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. మహిళలు కేక్ కట్ చేసి ఆప్యాయంగా ఒకరికొకరు తినిపించుకున్నారు. డీఈ సంపంగి శ్రీనివాసరావు మదర్స్ డే ప్రత్యేకతను తెలియజేశారు.

ప్రభుత్వ నిబంధనల ప్రకారం చేర్చుకుంటాం..

వెల్దండ: మండలంలోని 32 గ్రామపంచాయతీల్లో విధులు నిర్వహిస్తున్న కార్యదర్శుల్లో 26 మంది సమ్మెలో ఉన్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జేపీఎస్ కార్యదర్శులు సకాలంలో విధుల్లో చేరాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కానీ మండలంలో చౌదర్‌పల్లికి చెందిన అల్తాఫ్ అనే కార్యదర్శి మాత్రమే విధుల్లో చేరాడు. మరో 25 మంది నేటికి విధులకు హాజరుకాలేదన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు గతంలో కార్యదర్శి పరీక్షలకు హాజరైన వారిలో మెరిట్‌లిస్ట్ ప్రకారం చేర్చుకోవాలని ఆదేశించారు. అధికారుల ఆదేశాల మేరకు కార్యదర్శులను విధుల్లోకి తీసుకొని గ్రామాలకు నియమిస్తామని పేర్కొన్నారు.

విధుల్లోకి కార్యదర్శులు

ఊర్కొండ: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు తాము సమ్మెను విరమించి తిరిగి విధుల్లోకి చేరుతున్నట్లు జూనియర్ పంచాయతీ కార్యదర్శులు ఆదివారం ఎంపీడీఓకు లేఖ రాశారు. తమ డిమాండ్లను ప్రభుత్వం నెరవేస్తుందనే నమ్మకంతోనే సమ్మెను విరస్తున్నట్లు తెలియజేశారు.

డివైడర్‌పై కోనోకార్పస్ చెట్ల తొలగింపు



చెట్ల కొమ్మలను తొలగిస్తున్న నర్సింహగౌడ్

అచ్చంపేట రూరల్: పట్టణంలోని ప్రధాన రహదారి డివైడర్‌పై నిషేధంలో ఉన్న కోనోకార్పస్ చెట్లను ఆదివారం అచ్చంపేట మున్సిపాలిటీ సిబ్బంది తొలగించారు. మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్, కౌన్సిలర్లు దగ్గరుండి ప్రమాదకరంగా, నిషేధంలో ఉన్న చెట్లను తొలగించారు. కోనోకార్పస్ చెట్లతో శ్వాసకోశ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ఎలాంటి ఉపయోగంలో లేని చెట్లను తొలగించాలని ప్రజల నుంచి వస్తున్న విన్నపాలను దృష్టిలో పెట్టుకుని చెట్లు, మొక్కలు తొలగిస్తున్నామని చెప్పారు. ప్రజలకు కీడు కల్గించే ఎలాంటి చెట్లనైనా అనుమతితో తొలగిస్తామన్నారు.

వర్గీకరణతోనే మాదిగల అభ్యున్నతి

కొల్లాపూర్: ఎస్సీ వర్గీకరణ ద్వారానే మాదిగల అభ్యున్నతి సాధ్యమవుతుందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి యాదగిరి మాదిగ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ అంశంపై రాజకీయ పార్టీలు చిత్తశుద్ధితో వ్యవహరించాలని కోరారు. పార్లమెంట్‌లో వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి, ఆమోదించాలని బీజేపీ నాయకులను కోరారు. వర్గీకరణ సాధన కోసం మందకృష్ణ మాదిగ నేతృత్వంలో పోరాటం చేస్తామన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



కల్వకుర్తి: సీఎం సహాయ నిధి పథకం పేద మధ్యతరగతి ప్రజలకు వరం లాంటిదని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆదివారం కల్వకుర్తికి చెందిన ఆంజనేయులు భార్య జయంతికి మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కు రూ.లక్షను భర్తకు అందజేశారు. ఆనంద్, రాములు, శ్రీనివాస్, షానావాజ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



లింగాల: మండల పరిధిలోని అప్పాయపల్లిలో ఆదివారం చోటుచేసుకున్న అగ్ని ప్రమాదంలో జర్పుల భీమ్లానాయక్ గుడిసె పూర్తిగా దగ్ధమైంది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గువ్వల బాలరాజు బాధిత కుటుంబానికి తక్షణ సాయం అందజేయాలని సూచించారు. దీంతో ఎంపీటీసీ కాశీనాథం, నాయకులు పర్వతాలు, మొగిలి మహేష్ రూ.10 వేలను, 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు.

బాధితుడికి ఎమ్మెల్యే గువ్వల పరామర్శ

చారకొండ: మండలంలోని సిర్సనగండ్లకు చెందిన అంగోతు బాసుకు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయాలయ్యాయి. చికిత్స అనంతరం విశ్రాంతిలో ఉన్న బాసుని ఆదివారం ప్రభుత్వ విప్, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు కలిసి పరామర్శించారు. ప్రమాదానికి కారణాలను తెలుసుకున్నారు. వైద్య ఖర్చుల నిమిత్తం కొంత ఆర్థిక సాయం అందజేశారు.

మాజీ ఎమ్మెల్యే..

వంగూరు: మండల కేంద్రానికి చెందిన వార్డుసభ్యుడు రఫీ తండ్రి ఘనీఖాన్ ఇటీవల అనారోగ్యానికి గురవడంతో గుండె ఆపరేషన్ చేశారు. ఆదివారం మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ఆయన్ను పరామర్శించారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. రమేష్‌గౌడ్‌తో పాటు జనార్దన్, గఫూర్, మల్లేష్, చంద్రశేఖర్ ఉన్నారు.

మాజీ సర్పంచ్ మృతికి సంతాపం

కొల్లాపూర్ రూరల్: మండల పరిధిలోని ఎల్లూరు మాజీ సర్పంచ్ నిమ్మల నరసింహ అనారోగ్యంతో ఆదివారం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో కన్నుమూశారు. ఆయన మృతదేహాన్ని ఆయన స్వగ్రామమైన ఎల్లూరు చెంచుగూడెంకు తీసుకొచ్చారు. నియోజకవర్గంలోని వివిధ పార్టీల నాయకులు పుష్పగుచ్ఛం ఉంచి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ప్రజలు వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీని ఆదరించండి



మల్లొనిచెర్వుతండాలో మాట్లాడుతున్న వంశీకృష్ణ

లింగాల: కాంగ్రెస్ పార్టీని ఆదరిస్తేనే పేదల బతుకులు బాగుపడుతాయని మాజీ ఎమ్మెల్యే డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం మండల పరిధిలోని మల్లొనిచెర్వు, దేవిచెర్వుతండాలో హాథ్ సే హాథ్ జోడో యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా తండాల్లో ఇంటింటికీ తిరిగి ప్రజలను కలిశారు. దేశంలో, రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతుందని, ఈ మధ్య జరిగిన కర్ణాటక రాష్ట్రం అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారని అన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వెంటనే వరంగల్ డిక్లరేషన్‌తో పాటు, ప్రియాంకగాంధీ ప్రకటించిన నిరుద్యోగ డిక్లరేషన్ అమలు చేసి తీరుతామని భరోసా ఇచ్చారు. నాగేశ్వర్‌రావు, కొండల్‌రావు, జ్ఞానేశ్వర్‌రెడ్డి, షఫీ, బుడ్డయ్య, రాజు, ఇందిరమ్మ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక ఎన్నికల ఫలితాలపై హర్షం

చారకొండ: కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బాల్‌రాంగౌడ్ ఆదివారం హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ పనితీరు, గెలుపే లక్ష్యంగా పనిచేసిన పార్టీ నాయకులను ప్రశంసించారు. రాబోయే ఎన్నికల్లో తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల్లో ఈ ఫలితమే పునరావృతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకొన్నారు. వెంకట్ గౌడ్, నర్సింహ రెడ్డి, శంకర్ గౌడ్, అంజయ్య, నాగేంద్ర, తదితరులు ఉన్నారు.

వెల్టూర్‌లో సంబురాలు

ఉప్పునుంతల: కర్ణాటకలో వెలుబడిన ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ పార్టీ అఖండ విజయం సాధించడంపై ఆదివారం మండలంలోని వెల్టూర్‌లో ఆ పార్టీ శ్రేణులు సంబురాలు నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో తెలంగాణలో కూడా కర్ణాటక తరహా ఫలితాలు వస్తాయని అన్నారు. ఎంపీటీసీ రంగారెడ్డి, శ్రీశైలం, రాజమౌళి, ప్రహ్లాద, జనార్దన్, కృష్ణ పాల్గొన్నారు.

రోడ్డును ఆక్రమిస్తున్న కల్లాలు



రోడ్డుపై ఆరబోసిన మొక్కజొన్నలు

తాడూరు: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో ప్రధాన రహదారులపై రైతులు కల్లాలను ఏర్పాటు చేసుకోవడంతో రోడ్డు ఆక్రమణకు గురవుతుంది. దీంతో రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. మండలంలోని ఇంద్రకల్, లచ్చిరాంతండా, ఐతోల్, శిర్సవాడ, పాపగల్ గ్రామాల మీదుగా జడ్చర్ల వెళ్లే ప్రధాన ఆర్‌అండ్‌బీ డబుల్ రోడ్డు సగానికిపైగా మొక్కజొన్నలు, వరిధాన్యం రోడ్లపై ఆరబెట్టుకోవడం, ధాన్యం చుట్టూ రాళ్లను ఏర్పాటు చేసుకోవడంతో ప్రయాణం ఇబ్బందిగా మారిందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ధాన్యం ఆరబోసుకోవడానికి రైతులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

వెల్దండ: మండల పరిధిలోని రాఘయపల్లిలో ఇళ్ల మధ్యలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉండటంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. చేతికందే ఎత్తులు ట్రాన్స్‌ఫార్మర్ ఉండటంతో మూగజీవాలకు, ప్రజలకు విద్యుత్ ప్రమాదం జరిగే అవకాశం ఉందని కాలనీ వాసులు ఆందోళన చెందుతున్నారు. వర్షాకాలంలో ఉరుముల, మెరుపులకు ట్రాన్స్‌ఫార్మర్ నుంచి నిప్పురవ్వలు వస్తున్నాయన్నారు.

ఉపాధి కూలీలకు నీడ, నీరు ఏర్పాటు



కూలీలకు ఏర్పాటు చేసిన టెంటు

తాడూరు: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో ఉపాధి పనుల్లో పాల్గొనే కూలీలకు నీడ, నీరుతో పాటు వివిధ వసతులు ఏర్పాటు చేశామని ఉపాధిహామీ ఏపీఓ ప్రవీన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ప్రతి గ్రామంలో 100కు పైగా కూలీలకు పనులు కల్పిస్తున్నామని, పని ప్రదేశాల వద్ద కూలీలు సేద తీర్చుకోవడానికి టెంట్ల ద్వారా నీడను ఏర్పాటు చేయడంతోపాటు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, మెడికల్ కిట్లు, మినరల్ వాటర్ ఏర్పాటు చేశామన్నారు. దీంతో ఆయా గ్రామాల్లో ఉపాధి పనులు పుంజుకున్నాయన్నారు. గ్రామపంచాయతీలో ముందస్తుగా తీర్మానం చేసిన పనులకు ప్రాధాన్యత కల్పిస్తామన్నారు.

భక్తిశ్రద్ధలతో గంధోత్సవం



గంధోత్సవంలో పాల్గొన్న భక్తులు

కందనూలు: మున్సిపల్ పరిధిలోని నాగనూలు రోడ్డు సమీపంలోని సయ్యద్ సద్రుద్దీన్ షా ఖాద్రీ రహమతుల్లా అలే ఉర్సులో భాగంగా ఆదివారం రాత్రి గంధోత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. దర్గా ముతవల్లి షేక్ ఫహీమొద్దిన్ చిస్తి ఉల్ ఖాద్రీ ఆధ్వర్యంలో మహబుబ్ సుభాని వీధిలోని షేఖ్ నిరంజన్ నివాసం నుంచి గంధం బయలుదేరి భక్తి వచనాలు, డప్పు సాధనతో దర్గా వద్దకు గంధం చేరుకుంది. అనంతరం దర్గా వద్ద ఖవ్వాలి ఇతర ఆధ్యాత్మిక కార్యక్రమాలు, అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం దర్గా వద్ద దీపోత్సవంతో పాటు ధార్మిక, ఆధ్యాత్మిక, అన్నదాన కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలియజేశారు.

రైతులపై నిర్లక్ష్య వైఖరి విడనాడాలి



వరిధాన్యాన్ని పరిశీలిస్తున్న కేవీపీఎస్ నాయకులు

తాడూరు: ప్రభుత్వం రైతులపై నిర్లక్ష్య వైఖరి విడనాడి ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు కాశన్న డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని ఐతోల్, గోవిందాయిపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. రైతుల సమస్యలు అడిగి తెలుసుకుని కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చేవారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఆరుగాలం కష్టపడిన రైతన్న పండించిన ధాన్యాన్ని విక్రయించుకోవడానికి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చిందన్నారు. గ్రామాల్లో వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. సిబ్బంది రైతులను ఇబ్బందులకు గురికాకుండా చూడాలన్నారు. కేవీపీఎస్ నాయకులు చంద్రయ్య, ఆంజనేయులు, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వరిధాన్యం కొనుగోళ్లు

పెద్దకొత్తపల్లి: సింగిల్ విండో పరిధిలోని 10 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో యాసంగిలో రైతులు పండించిన వరిధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటి వరకు 25 లారీల వరిధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు సింగిల్‌విండో సీఈఓ కృష్ణప్రసాద్ తెలిపారు. మరో 20 లారీల వరకు రైతుల నుంచి వరిధాన్యం రావొచ్చని చెప్పారు. దేవల్‌తిరుమలాపూర్ కొనుగోలు కేంద్రం పెద్దకొత్తపల్లి, పెద్దకార్పాముల, చిన్నకార్పాముల, చిన్నకొత్తపల్లి, మరికల్, ముష్టిపల్లి, నక్కలపల్లి, వెన్నచర్ల, జొన్నలబొగుడ, చంద్రకల్ గ్రామాల్లో వరిధాన్యాన్ని పెద్దకొత్తపల్లి సింగిల్‌విండో వారు కొనుగోలు చేస్తున్నారు. కొత్తపేట సింగిల్‌విండో పరిధిలోని 8 కేంద్రాల నుంచి ఇప్పటి వరకు 6 లారీల వడ్లు మాత్రమే కొనుగోలు చేశారు. తేమ, తరుగు ఎక్కువగా తీయడంతో రైతులు ఈ కొనుగోలు కేంద్రాల్లో వడ్లు అమ్మడం లేదు. రైతులు ప్రైవేట్ వ్యాపారులకు వడ్లు విక్రయిస్తున్నారు.

కనీస వేతనం అమలు చేయాలి



తెలకపల్లిలో మాట్లాడుతున్న ప్రభాకర్



పెంట్లవెల్లిలో...

తెలకపల్లి: ఐకేపీలో పనిచేస్తున్న వీఓఏలకు గౌరవ వేతనం వద్దు, కనీస వేతనం అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మందుల ప్రభాకర్ డిమాండ్ చేశారు. వీఓఏలు తమ సమస్యలు పరిష్కరించాలని చేస్తున్న నిరవధిక సమ్మె ఆదివారానికి 28వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఆయన మద్దతు తెలుపుతూ.. మాట్లాడారు. వీఓఏలు సమ్మె చేస్తుంటే ప్రభుత్వం వారిపై నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తుందని అన్నారు. వీఓఏల సమ్మెను విరమింపజేయాలని, సమస్యలు పరిష్కరించాలన్నారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని, అర్హులైన వారికి సీసీలుగా పదోన్నతులు ఇవ్వాలని, ప్రతి నెలా వేతనాలు వీఓఏల వ్యక్తిగత ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మందుల ప్రభాకర్‌తో పాటు సీఐటీయూ జిల్లా నాయకులు గోపాస్ లక్ష్మణ్, మహేష్, వీఓఏలు గిరిజ, విజయ, మల్లేష్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

పెంట్లవెల్లి: మండల కేంద్రంలో ఐకేపీ వీఓఏల సమ్మెలో తల్లిదండ్రులకు తోడుగా వారి పిల్లలు సమ్మెలో ఉదయం నుంచి సాయంత్రం వరకు పాల్గొన్నారు. మా తల్లిదండ్రులకు జీతాల పెంపునకు, ఉద్యోగ భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో వసంత, రేణుక, మురళి, బాలకృష్ణ పాల్గొన్నారు.

నత్తనడకన డబుల్‌బెడ్రూం ఇళ్ల నిర్మాణాలు



వనపట్లలో కొనసాగుతున్న డబుల్‌బెడ్రూం ఇళ్లు



తాడూరులో ..

నాగర్‌కర్నూల్ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఇల్లు లేని పేద ప్రజల సౌకర్యార్థం గ్రామాల్లో నిర్మిస్తున్న డబుల్‌బెడ్రూం ఇళ్ల నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. నాలుగేళ్ల కిందట పిల్లర్లు వేసి స్లాబులు వేసి ప్రస్తుతం గోడల నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. మండలంలోని పెద్దముద్దునూరు మినహా వనపట్ల, గన్యాగుల గ్రామాల్లో ఈ ఇళ్ల స్లాబ్ లేవల్‌లోనే నిర్మాణాలు కొనసాగుతుండటంతో లబ్ధిదారులు ఇళ్లను పూర్తి చేసేదెన్నడూ.. ఇల్లు లేని పేద ప్రజలకు పంచేదెన్నడంటూ ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తీసుకొచ్చి ఇళ్ల నిర్మాణాలు శరవేగంగా పూర్తి చేయాలని కోరుతున్నారు.

నిధుల కొరతతో నిలిచిన పనులు

తాడూరు: మండల కేంద్రంలో కోనొంపు ప్రాంతంలో ఏడాది కిందట నిర్మాణం చేపట్టిన డబుల్ బెడ్రూం ఇళ్ల పనులు పునాదుల వరకే పరిమితమయ్యాయి. ఎంతో ఆర్భాటంగా పనులు చేపట్టారు. 140 ఇళ్ల నిర్మాణానికి అప్పట్లో శంకుస్థాపన చేశారు. నిధుల కొరత కారణంగా పనులు నిలిచిపోయాయని కాంట్రాక్టర్ తెలియజేశారు. దాదాపు కోటికిపైగా నిధులు రావాల్సి ఉందని, సకాలంలో రాకపోవడంతో నిర్మాణ పనులు చేపట్టలేకపోయాయన్నారు.

కంకర రోడ్లతో ప్రయాణికుల అవస్థలు



చెదురుపల్లి సమీపంలో కంకర తేలిన రోడ్డు

వెల్దండ: మండల పరిధిలోని ఆయా గ్రామాల్లోని కంకర తేలిన రోడ్లతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. మండలంలోని పెద్దాపూర్-కలిమిరాళ్ల తండా రోడ్డులో వెళ్తున్న ప్రయాణికులు రాత్రి వేళలో ప్రమాదాలకు గురవుతున్నారు. కొట్ర- పోతేపల్లిలో ఇదే పరిస్థితి నెలకొంది. అనేకమార్లు గ్రామస్తులు ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు.

వెల్దండ- సిర్సనగండ్ల రోడ్డు...

వెల్దండ మండల కేంద్రం నుంచి సిర్సనగండ్ల గ్రామాలకు వెళ్తున్న రోడ్డులో చెదురుపల్లి, నగరగడ్డ తండాలో రోడ్డుకు మరమ్మతు చేస్తున్నారు. పనులు ప్రారంభించి దాదాపుగా ఏడాది గడుస్తున్నా.. నేటికి పనులు పూర్తి చేయలేదు. బ్రిడ్జిలను నిర్మించి బీటీరోడ్డు వేసేందుకు కంకర పరిచారు. దీంతో కంకర తేలిన రోడ్డుపై వాహనదారులు తరచుగా ప్రమాదాలకు గురవుతున్నారు. సంబంధిత కాంట్రాక్టర్లు వెంటనే స్పందించి రోడ్డును పూర్తిచేసి ఇబ్బందులు తీర్చాలని కోరుతున్నారు.